సాక్షి ఒడిశా

మంగళవారం। 11 ఏప్రిల్। 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,77,448లు, బంగారం 9.55 గ్రాములు, వెండి 28 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



పుంజుకుంటున్న కోవిడ్ కేసులు

- 8లో



పిన్నిగారింటికి శాంతమ్మ

- 8లో

న్యూస్‌రీల్

అగ్ని బాధితులకు అండగా..



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న తహసీల్దార్, ఆర్ఐ

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి భామిని పంచాయతీ పరిధి ఖాల్‌గుమడ కంపో వీధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సర్వం కోల్పోయిన ఆశు కుంభారో, గుండు కుంభారో కుటుంబాలకు చెందిన బాధితులను తహసీల్దార్ నిర్మల్‌చంద్ర సాహు, ఆర్ఐ కేశవ్ సాబోరో సోమవారం ఉదయం పరామర్శించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, నివేదికను ఉన్నతాధికారులకు అందించడంతో పాటు పరిహారం చెల్లించేందుకు కృషి చేస్తామన్నారు.

1740లీటర్ల మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

బరంపురం: జిల్లా ఎక్సైజ్ విభాగం అధికారులు గత కొద్ది రోజులుగా చేపట్టిన దాడుల్లో వేలాది లీటర్ల నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో భాగంగా బరంపురం–ఛత్రపూర్ మధ్య సోమవారం నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో 1740లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ కమిషనర్ దామోదర్ పండా తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని చమ్మఖండి పోలీసు స్టేషన్ పరిధి బొనుగునాపల్లి గ్రామం వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న 1740 లీటర్ల విదేశీ మద్యాన్ని పట్టుకొన్నారు. అరెస్టయిన వారిలో జిల్లాకు చెందిన శంకర్ ప్రధాన్, సంజాయ్ ప్రధాన్, శివశంకర్ కుటియాగా గుర్తించారు.

కుక్కల దాడిలో జింక మృతి



జింకపిల్లను వైద్యశాలకు తరలిస్తున్న అప్పలస్వామి

రాయగడ: కుక్కల దాడిలో గాయపడిన జింక.. ప్రాణాలతో పోరాడి, చివరకు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక జెఎస్‌కో వెనుక జింకపిల్ల తీవ్ర గాయాలతో పడి ఉండటాన్ని గమనించిన ఆదివాసీ మహాసంఘం అధ్యక్షుడు అప్పలస్వామి కద్రక వెంటనే వన్య ప్రాణిని పశు వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే తీవ్ర గాయాలు కావడంతో వైద్యం అందించిన కొద్ది కొద్ది సేపటికే మృతి చెందింది. దీంతో అటవీశాఖ అధికారులకు అప్పగించారు. సమీప అడవుల నుంచి జింక పిల్ల జనావాసాల్లోకి రావడం, కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో ఈ ఘటన జరిగిందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. సుమారు మూడేళ్ల వయస్సు ఉన్న ఇది.. గుమ్మా అడవుల నుంచి వచ్చింటుందని భావిస్తున్నారు.

కార్మిక కార్యాలయం ముట్టడి



అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న మహిళలు

జయపురం: పట్టణంలోని సేవా పేపరుమిల్లులో పనిచేస్తూ మరణించిన శ్రామికుల భార్యలు, కుటుంబాల సభ్యులు జయపురం కార్మిక కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. కార్మికసంఘం నాయకుడు ప్రమోద్‌కుమార్ మహంతి, సమాజ సేవకుడు బి.హరిరావు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్మికశాఖ అధికారికి వినతిపత్రం అందించారు. మార్చి 27న మిల్లు యాజమాన్యం మరణించిన శ్రామికుల జాబితా, చెల్లించాల్సిన గ్రాడ్యూటీ జాబితాను వెల్లడించి విడతల వారీగా చెల్లిస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఇది ఆచరణకు నోచుకోలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎండ.. సుర్రు మంటోంది..

- రాష్ట్రంలో హడలెత్తిస్తున్న వడగాలులు
- ఝార్సుగడలో అత్యధికంగా 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- 28 జిల్లాల్లో 35 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు
- పలు జిల్లాలకు వర్ష సూచన జారీ చేసిన వాతావరణ కేంద్రం



భువనేశ్వర్:

రాష్ట్రంలో వడగాలుల తీవ్రత పుంజుకుంటోంది. ఉదయం వేడి తాకిడి క్రమంగా పెరుగుతోంది. రాష్ట్ర రాజధాని నగరం భువనేశ్వర్‌లో సోమవారం ఉదయం 8.30 గంటలకు 31 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రాష్ట్రంలోని మొత్తం 30 జిల్లాల్లో.. నువపడా, ఛత్రపురం మినహా, దాదాపు 28 జిల్లాల్లో 35 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. భువనేశ్వర్‌లో 39.7, ఝార్సుగుడలో 40.4 డిగ్రీలతో రాష్ట్రంలో అత్యంత వేడి ప్రదేశాలుగా నమోదయ్యాయి. ఉదయం 11.37 గంటలకు బాలాసోర్‌లో 37 డిగ్రీలు, సంబల్‌పూర్ హిరాకుడ్‌లో 36, కెంజొహర్‌లో 35.4, గోపాల్‌పూర్, పూరీ ప్రాంతాల్లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ప్రాంతీయ కార్యాలయం వెల్లడించింది. దీంతో సాధారణ జనజీవనం ప్రభావితమైంది. ఫలితంగా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. రానున్న కొద్ది రోజుల్లో భువనేశ్వర్, కటక్ జంట నగరాలలో పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటే అవకాశం ఉంది. సుమారు వారం రోజులు ఎండ తీవ్రత వేధింపులు పొంచి ఉన్నాయి. ఈ వ్యవధిలో వేడిమి పెంచే రీతిలో వాతావరణ మార్పులు చోటు చేసుకునే పరిస్థితులు ఉన్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్టం (డిగ్రీల సెల్సియస్‌లో)	ప్రాంతం	గరిష్టం (డిగ్రీల సెల్సియస్‌లో)
ఝార్సుగుడ	40.4	తాల్చేరు	38.6
బరిపద	40.0	రౌర్కెలా	38.6
భువనేశ్వర్	39.7	హీరాకుండ్	38.3
చాంద్‌బాలి	39.7	బర్‌ఘడ్	38.2
అంగూల్	39.7	బాలాసోర్	38.0
సంబల్‌పూర్	39.7	నయాగడ్	38.0
మల్కన్‌గిరి	39.5	దేవ్‌గడ్	37.4
బౌధ్	39.5	పర్లాకిమిడి	37.0
టిట్లాగడ్	39.2	ఖుర్దా	37.0
సోన్‌పూర్	39.2	కెంజొహర్	36.8
సుందరగడ్	39.0	ఢెంకనాల్	36.6
భద్రక్	39.0	ఫుల్బాణి	35.8
కటక్	39.1	గోపాల్‌పూర్	35.4
జగత్‌సింగ్‌పూర్	39.0	ఛత్రపురం	35.0
భవానీపట్న	38.5	నువాపడా	35.0
బొలంగీర్	38.5		

వాతావరణ కేంద్రం సమాచారం..

రానున్న 2, 3 రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉందని భువనేశ్వర్‌లోని భారత వాతావరణ కేంద్రం సమచారం జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అకస్మాత్తుగా గరిష్ట ఉష్ణోగ్రత పెరగడంతో సాధారణ జనజీవనం అస్తవ్యస్తమై గడప దాటేందుకు బిక్కు బిక్కుమంటున్నారు.

రానున్న 5 రోజుల్లో దేశంలోని బీహార్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్, హర్యానా లోని కొన్ని ప్రాంతాల్లో వడగాడ్పుల తీవ్రత గణనీయంగా పెరిగే అవకాశం ఉందని విభాగం డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. వాతావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈనెల 12 నాటికి రాష్ట్రంలోని పలు చోట్ల సాధారణ గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ దాటుతుంది. ఇటీవల కొనసాగిన ఉరుములతో కూడిన గాలివాన వాతావరణం తొలగిపోయింది. దీని ప్రభావంతో మరో రెండు మూడు రోజుల్లో వేడి కొనసాగుతుందని భువనేశ్వర్ వాతావరణ కేంద్రం శాస్త్రవేత్త ఉమాశంకర్ దాస్ వెల్లడించారు.

కొన్ని జిల్లాలకు ఉపశమనం..

మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు కొరాపుట్, నవరంగ్‌పూర్, మల్కన్‌గిరి, గజపతి, రాయగడ, కంధమల్, మయూర్‌భంజ్, కెంజొహర్, బాలాసోర్, కలహండి, సుందర్‌గఢ్ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని ముందస్తు సమాచారంతో ఐఎండీ సోమవారం ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. ఈ సమయంలో కొరాపుట్, రాయగడ, కంధమల్, నవరంగ్‌పూర్, నువాపాడ, గజపతి జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. దక్షిణ, కోస్తా ఒడిశాలోని కొన్నిచోట్ల రానున్న రెండు రోజులు వర్షాలు కురుస్తాయి. అనంతరం రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుంది.



వాతావరణ కేంద్రం జారీ చేసిన వర్షం సూచన వివరాలు

ఒంటిపూట బడులు

రాష్ట్రంలో వడగాడ్పుల తీవ్రత పెరగడంతో ఒంటి పూట బడుల నిర్వహణతో తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం సోమవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 11నుంచి రోజూ ఉదయం 7గంటల నుంచి 11.30 వరకు ఒకటి–12వ తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ఉత్తర్వులు స్పష్టం చేశాయి.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ



సమావేశంలో ప్రసంగిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సస్మితా మెలకా

కొరాపుట్:

దివ్యాంగులకు ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీని జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించారు. దివ్యాంగుల పునరావస కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 227మంది దివ్యాంగులకు ఈ అవయవాలు పంపిణీ చేయనున్నారు. తొలి రోజు దసమంత్‌పూర్, నారాయణపట్న, లక్ష్మీపూర్, కుంద్రా సమితులకు చెందిన 59 మందికి అవయవాలు అమర్చారు. మంగళవారం బొయిపరిగుడ, బొరిగుమ్మ, లమతాపుట్, నందపూర్ సమితులకు చెందిన 53మందికి వీటిని అందించనున్నారు. ఈనెల 13వరకు ఈ శిబిరం కొనసాగనుంది. సమావేశంలో మాట్లాడిన సస్మితా మెలకా జిల్లావ్యాప్తంగా ఇంటింటా సర్వే నిర్వహించి, అర్హులైన ప్రతి దివ్యాంగునికి వీటిని అమర్చాలని ఆదేశించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారులు అమూల్యకుమార్ దాస్, జగన్నాథ నాయక్, సుధాంశుకుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కృత్రిమ కాలుతో దివ్యాంగుడు

తరుణ్‌పాండే అభ్యర్థిత్వం ఖరారు



- ఝార్సుగుడ ఉప ఎన్నికపై కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం
- మాజీ ఎమ్మెల్యే బీరేన్ పాండే మృతితో కుమారుడికి అవకాశం

భువనేశ్వర్: ఝార్సుగుడ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిగా తరుణ్ పాండేను సోమవారం ప్రకటించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదంతో అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు తెలిపారు. సీనియర్ నాయకుడు, కంటాబంజి నియోజకవర్గ ఎమ్మెల్యే సంతోష్‌సింగ్ సలూజా నేతృత్వంలో ఒడిశా కాంగ్రెస్ బృందం ఉప ఎన్నిక కోసం ఇద్దరు అభ్యర్థుల పేర్లను అధిష్టానానికి సిఫార్సు చేసింది. వీరిలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఝార్సుగుడ నుంచి పోటీచేసిన మహేంద్ర నాయక్, మాజీ ఎమ్మెల్యే బీరెన్ పాండే కుమారుడు తరుణ్ పాండే ఉన్నారు. బీరెన్ గత నెలలో మరణించారు. 1980, 1985, 1995లో కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేసి రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. ఆయన మరణంతో సానుభూతి అనుకూల ఓట్లు తరుణ్ పాండేకు వస్తాయనే దృక్పథంతో పార్టీ అధిష్టానం ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడం విశేషం. సానుభూతి అవకాశాలను సానుకూలంగా మలచుకునే వ్యూహంతో తరుణ్‌ను బరిలోకి దింపింది. ఇదే దృక్పథంతో దివంగత మంత్రి నవకిషోర్ దాస్ కుమార్తె దీపాలి దాస్‌ను అధికార పక్షం బిజు జనతాదళ్ బరిలోకి దింపి మహిళలు, యువతుల ఓట్లను కూడగట్టుకునే లక్ష్యంతో ముందస్తుగా అభ్యర్థిని ప్రకటించిన విషయం తెలిసిందే.



తరుణ్ పాండే

నిరుద్యోగ సమస్యపై..

ఝార్సుగుడ స్థానికులకు ఉద్యోగాలు, శాంతి భద్రతల ప్రధాన సమస్యలు అజెండాతో ఉప ఎన్నికలో పోటీ చేస్తున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి తరుణ్‌పాండే ప్రకటించారు. ఈ పోటీలో తన గెలుపు ఖాయమని, పోటీ ప్రధానంగా బీజేడీతోనే ఉంటుందని తెలిపారు. ఉప ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈనెల 13న ప్రారంభమై, 20వరకు నిరవధికంగా కొనసాగుతుందన్నారు. మే 10న పోలింగ్ నిర్వహించి, 13న ఫలితాలు ప్రకటించేందుకు ఎన్నికల కమిషన్ షెడ్యూలు జారీ చేసింది. స్థానిక ఎమ్మెల్యే, ఆరోగ్య–కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిషోర్ దాస్ హత్యతో అసెంబ్లీ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఉప ఎన్నిక అనివార్యమైంది.

చెట్టును ఢీకొని పికప్ వ్యాన్ డ్రైవర్ మృతి



చెట్టుకు ఢీకొన్న పికప్ వ్యాన్

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రం నుంచి బియ్యం లోడుతో మత్తిలి వెళ్తున్న ఓ పికప్ వ్యాన్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొంది. మల్కన్‌గిరి సమితి పంగం పంచాయతీ మాలిగూడ గ్రామం వద్ద సోమవారం వేకువజామున జరిగిన ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం అటుగా వెళ్తున్న గ్రామస్తులు ఘటనను గమనించి, వెంటనే మత్తిలి పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు, మల్కన్‌గిరి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. గ్యాస్ కట్టర్ సాయంతో అతి కష్టంపై వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. అయితే ఆయన అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు మల్కన్‌గిరి జిల్లా ఎంవీ–56 గ్రామానికి చెందిన అశిత్‌కుమార్ గొలాధర్‌గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్వాభిమాన్ ఏరియాలో ఎస్పీ పర్యటన



యువకులకు క్రీడా సామగ్రి అందిస్తున్న ఎస్పీ నితీష్ వాధ్వనీ

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం పెప్పరమెట్ల పంచాయతీలో మల్కన్‌గిరి ఎస్పీ నితీష్ వాధ్వనీ సోమవారం పర్యటించారు. ఈ మేరకు చిత్రకొండ ఎస్‌డీపీఓ అలెక్సియస్ కిస్పేట్ ఆధ్వర్యంలో జనసంపర్క శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో పెప్పరమెట్ల, ధూళిపుట్ పంచాయతీలకు చెందిన సుమార్ వెయ్యి మంది గిరిజనులకు వివిధ రకాల సామగ్రి అందజేశారు. చీరలు, దుస్తులు, చిన్నారులకు ఆట సామగ్రి, పుస్తకాలు, వేసవి కావడంతో వృద్ధులకు గొడుగులు, టార్పిలెట్లు పంపిణీ చేశారు. గిరిజన యువకులకు క్రీడా సామగ్రి అందించి, వారిలోని ప్రతిభను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిత్రకొండ, మల్కన్‌గిరి పోలీసులు పాల్గొన్నారు.



వృద్ధులకు గొడుగులు పంపిణీ చేస్తున్న ఎస్‌డీపీఓ కిస్పేట్

క్రికెట్ విజేతకు సత్కారం



విజేతల సన్మానంలో పాల్గొన్న అతిథులు, క్రీడాకారులు

జయపురం: ఇటీవల నిర్వహించిన కలహండి క్రికెట్ కప్ చాంపియన్‌షిప్ పోటీలో విజేతగా నిలిచిన కొరాపుట్ జిల్లా క్రికెట్ జట్టును జయపురంలో ఘనంగా సన్మానించారు. సబ్ డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ విక్రమ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సభలో విజేతలను సన్మానించారు. జయపురం అసోసియేషన్ కార్యదర్శి రబినాయక్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరాపుట్ క్రికెట్ జట్టు ప్రతిష్టాత్మకమైన కలహండి కప్‌ను మొదటిసారి గెలుచుకొని, జిల్లాకు పేరు తెచ్చారని కొనియాడారు. త్వరలో జరుగనున్న సూర్‌లీగ్ కప్ క్రికెట్ పోటీల్లో ఆడి, విజయం సాధించాలని విజేత సభ్యులకు విన్నవించారు. రబి నాయిక్ మాట్లాడుతూ కలహండి కప్పులో ప్రతిభావంతంగా ఆడి, విజయం సాధించిన జట్టు సూపర్ లీగ్‌లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. రంజీ లీగ్‌కు వెళ్లిన ఆటగాళ్లందరి ఖర్చు అసోసియేషన్ భరిస్తుందని ప్రకటించారు. కార్యక్రమంలో ఒడిశా క్రికెట్ అకాడమీ మాజీ ఉపాధ్యక్షుడు అనూప్‌కుమార్ పాత్రొ, సభ్యులు భవానీ పండా, బాలారాయ్, గుప్త గొఢ, టీమ్ లీడర్ బై.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి నరేంద్ర మహంతి, విజేత క్రీడాకారులకు అందించి, అభినందనలు తెలిపారు. కలహండి కప్ పోటీలో ఆడిన అభిషేక్ మహంతి, చిన్మయ పండా, దిలీప్ స్వాయి, శుభాష్ సింగ్, ఎ.కిరణ్, లిబ్బ బిశాయి, బిష్ణు పాత్రొ, రోహిత్ గుప్తా, వై.యువరాజ్ ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

కార్టూనిస్ట్ శేఖర్‌కు సత్కారం


కార్టూనిస్ట్ శేఖర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

రాయగడ: గజపతి జిల్లా పర్లాకిమిడికి చెందిన కార్టూనిస్ట్ ముండూరు శేఖర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు సోమవారం సత్కరించారు. తిరుపతి లోని మహతి ఆడిటోరియంలో గత 2రోజులుగా కొనసాగుతున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు ఒడిశా నుంచి పలువురు కవులు, సాహితీవేత్తలు హాజరయ్యారు. ఇందులో పాల్గొన్న ఆయన.. తన కార్టూన్‌లను ప్రదర్శించి, ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమావతి తదితరులు శేఖర్‌ను ఘనంగా సన్మానించారు.

గ్రామ దేవత పండగ చాటింపు


కమిటీ సభ్యుల సమక్షంలో పార్వతీపురంలో గ్రామదేవతల పండగ చాటింపు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలో మే 28, 29, 30 తేదీల్లో జరగనున్న ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ గ్రామదేవత పండగకు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం చాటింపు వేశారు. కోవిడ్ కారణంగా నాలుగేళ్లుగా పండగ జరపలేదు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలించడంతో పండగ నిర్ణయించేందుకు గ్రామస్తులు, పెద్దలు నిర్ణయించారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు పండగకు ప్రభుత్వపరంగా సహకారం అందజేయాలని మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మాణించడంపై కమిటీ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మంత్రి రవికుమార్, జయప్రకాష్‌నారాయణ, మాధవ పాల్గొన్నారు.

నేలబావిలో పడి ఇద్దరు చిన్నారుల మృతి?

కురుపాం: కురుపాం మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ పరిధి పెదగూడ గిరిజన గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు నేలబావిలో పడి మృతి చెందినట్టు సమాచారం. పెదగూడ గ్రామానికి చెందిన ఊయక సందీప్ (5), ఆరిక సెబాస్టియన్ (4)అనే ఇద్దరు చిన్నారులు ఆటలాడుకుంటూ సోమవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో ఉన్ననేల భావి దగ్గరకు వెళ్లారు. ప్రమాదవ వశాత్తు బావిలో పడిపోయారు. ఈ దృశ్యాన్ని చూసిన యువతి గ్రామస్తులకు తెలియజేయడంతో అందరూ ఘటనా స్థలానికి చేరుకున్నారు. నేలబావిలో దిగి చిన్నారులను బయటకు తీశారు. అప్పటికే చిన్నారులు మృతి చెందడంతో తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. గిరిజన కట్టుబాట్ల ప్రకారం విషయం బయటకు తెలియకుండా ఇద్దరు చిన్నారులను ఖననం చేసినట్టు సమాచారం. ఈ ఘటనపై నీలకంఠాపురం ఎస్‌ఐ అనీల్ వద్ద ప్రస్తావించగా తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

40 ఏళ్ల తర్వాత...


కొండాపురంలో గ్రామదేవత పండగ ఏర్పాట్లలో నిమగ్నమైన ప్రజలు, కమిటీ సభ్యులు

పాలకొండ రూరల్: మండలంలోని కొండాపురంలో గ్రామదేవత పండగ నిర్వహించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. ఈ నెల 23వ తేదీ నుంచి 12 రోజులపాటు పండగ నిర్వహించాలని తీర్మానించారు. 40 ఏళ్ల తరువాత జరుగుతున్న పండగలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

మక్కువ: మండలంలోని కవిరిపల్లి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి బైక్ అదుపు తప్పి జరిగిన ప్రమాదంలో సాలూరులోని బంగారమ్మకాలనీకి చెందిన నగిరికట్ల శివ(30) మృతి చెందాడు. స్నేహితుడు సబ్బరపు శంకర్‌తో కలిసి నగిరికట్ల శివ ద్విచక్ర వాహనంపై మక్కువ వచ్చాడు. మక్కువ నుంచి కవిరిపల్లి మీదుగా సాలూరు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతి చెందగా, శంకర్‌కు గాయాలయ్యాయి. మృతుడు శివకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


సోమేశ్వరరావు మృతదేహం

జియ్యమ్మవలస: మండలంలోని తాళ్లడుమ్మ గ్రామానికి చెందిన పట్నాన సోమేశ్వరరావు (38) తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కళాధర్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమేశ్వరరావు తొలుత చాకుతో శరీరంపై పొడుచుకుని అనంతరం తాడుతో ఉరి వేసుకున్నాడు. మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడం, మద్యానికి బానిస కావడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు సోమే శ్వరరావు భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రచనలు సమాజాన్ని చైతన్యపరచాలి

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి


వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: రచనలు సమాజాన్ని చైతన్య పరచేలా ఉండాలని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణిపతి పిలుపునిచ్చారు. పట్టణంలోని సరస్వతి సాహితీ పరిషత్ సంసద్ మూడో వార్షికోత్సవంలో సోమవారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిస్తున్నారని, రచయిత్రులుగా మిగతా వారికి సవాల్ విసరడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. సాధికారత సాధించి, సామాజికంగా ఎదిగేందుకు మహిళా రచయితలు రచనలు చేయాలని సూచించారు. అలాగే ముఖ్యవక్తగా ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు లక్ష్మీకాంత పాఢి మాట్లాడుతూ మహిళలు ఒడిశా సాహిత్య విలువలను పెంచడం ఆనందంగా ఉందన్నారు. కొరాపుట్ శిశుకల్యాణ విభాగ అధికారి గాయత్రీ పాత్రొ, సాహితీవేత్త యజ్ఞేశ్వర పండా ప్రసంగించారు. జయపురం మున్సిపాలిటీ కౌన్సిలర్ పి.పద్మారెడ్డి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. సాహితీ పరిషత్ కార్యదర్శి సరస్వతీ సాహు వార్షిక నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమాన్ని పతంజలి యోగ సమితి జయపురం ప్రహారి జానకి పాణిగ్రహి పర్యవేక్షించారు. కార్యక్రమంలో సాహితీ ప్రియులు పూర్ణ చంద్ర పాత్రొ, శేఖర దళపతి కుటుంబ సభ్యులు, బిశ్వనాథ్ నాయక్ లను సన్మానించారు. అనంతరం చిన్నారులు నృత్యాలతో సభికులను అలరించారు. చిన్నారి కళాకారులను అతిథులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులను జయపురం సరస్వతి సాహితీ పరిషత్ సంసద్ అధ్యక్షురాలు అనసూయ సామంతరాయ్ జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం జరిగిన కవితా పఠనం శౌభాగిని నందా, సంజుక్త రౌత్ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మహిళా రచయితలు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే, మహిళా రచయితలు

పుంజుకుంటున్న కోవిడ్ కేసులు

- రాష్ట్రంలో 629 యాక్టివ్ కేసులు గుర్తింపు
- సుందర్‌ఘడ్ జిల్లాలో వ్యక్తి మృతిపై అనుమానాలు



భువనేశ్వర్: రాష్ట్రంలో కోవిడ్-19 సంక్రమణ తాజా పరిస్థితులు కలవర పరుస్తున్నాయి. పూర్వ పరిస్థితి పునరావృతం అవుతుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. పాజిటివ్ కేసుల సంఖ్య క్రమంగా పుంజుకుంటోంది. ఈ ఏడాది కరోనా తొలి మృతి చోటు చేసుకున్నట్లు అనధికారిక సమాచారం. గత 5 నెలల్లో ఇదే తొలి కోవిడ్ మరణం కావడం కలకలం రేపుతోంది. ఈ మృతిని ప్రభుత్వ వర్గం ఇంత వరకు ధ్రువీకరించ లేదు. తాజా పరిణామాల దృష్ట్యా కరోనా లక్షణాలు అభివృద్ధి చెందితే ఆలస్యం చేయకుండా సత్వర చికిత్స పొందాలని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నిరంజన్ మిశ్రా సోమవారం ప్రజలకు తెలిపారు. యాక్టివ్ కేసులు పెరిగినప్పటికీ ఇన్ఫెక్షన్ రేటు స్థిరంగా ఉందన్నారు. 629 యాక్టివ్ కేసుల్లో 12మంది చికిత్స కోసం ఆస్పత్రిలో చేరారు. కోవిడ్ నిర్ధారణ పరీక్ష, ట్రాకింగ్, చికిత్స ప్రాథమిక మార్గదర్శకాలను అనుసరిస్తున్నట్లు పేర్కొన్నారు. లక్షణాలు తారసపడితే తక్షణమే కోవిడ్ పరీక్ష చేయించుకుని, తగు జాగ్రత్త వహించడం అనివార్యమన్నారు. ప్రధానంగా క్వారంటైన్ మార్గదర్శకం అనుసరించడం శ్రేయోదాయకంగా వివరించారు. కోవిడ్ సంక్రమణ, విస్తరణ ఇతరేతర అనుబంధ నియంత్రణ కార్యాచరణకు సన్నద్ధత అంచనా నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని ఆస్పత్రులలో భారీ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ సోమవారం ఉదయం 8 గంటలకు జారీ చేసిన తాజా సమాచారం ప్రకారం రాష్ట్రంలో గత 24 గంటల్లో 102 కొత్త కేసులు నమోదయ్యాయి. 29మంది లో సంక్రమణ తొలగి, ఆరోగ్యంతో కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. తాజాగా కోవిడ్ మృతి సంభించినట్లు ప్రసారం కావడం కలకలం రేపుతోంది. సుందర్‌ఘడ్ ప్రాంతంలో గత 5 నెలల్లో మొదటి కోవిడ్ మృతి నమోదైనట్లు సమాచారం. ఈ ప్రాంతంలో 50 ఏళ్ల వ్యక్తి కోవిడ్-19 సంక్రమణకు గురై, ఆస్పత్రిలో చేరి చికిత్స కొనసాగుతుండగా తుదిశ్వాస విడిచాడు. అయితే రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారికంగా ఈ మృతిని ధ్రువీకరించలేదు. గత 24 గంటల్లో దేశంలో పలుచోట్ల 5,880 కొత్త కేసులు నమోదు కాగా.. 14 మరణించారు. ఈ నేపథ్యంలో అంటు వ్యాధుల పెరుగుదలకు కారణమయ్యే ఎక్స్‌బీబీ1.16 సబ్ వేరియంట్ సంక్రమణకు కళ్లెం వేసేందుకు ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. నివారణ, నియంత్రణ, చికిత్స నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల అత్యవసర సంసిద్ధతను సమీక్షించడం ప్రారంభించారు. సోమవారం నుంచి 2రోజులు దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్ చేపట్టనున్నారు. కోవిడ్ కేసుల తాజా పెరుగుదల ప్రభావంతో ముందు జాగ్రత్త చర్యగా హర్యానా, పుదుచ్చేరి ప్రభుత్వాలు బహిరంగ ప్రదేశాల్లో ఫేస్ మాస్కులు ధరించడం తప్పనిసరి చేశాయి.

క్యాపిటల్ ఆస్పత్రిలో మాక్‌డ్రిల్..

ఇదిలా ఉండగా.. కోవిడ్-19 కేసులను ఎదుర్కోవడంలో ఆస్పత్రి సంసిద్ధతను తనిఖీ చేసేందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సోమవారం ఉదయం భువనేశ్వర్ లోని క్యాపిటల్ ఆస్పత్రిలో కరోనా కేసుల మాక్‌డ్రిల్ నిర్వహించారు. మంగళవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. కోవిడ్ స్పెషాలిటీ ఆస్పత్రి కానప్పటికీ, ఎటువంటి విపత్కర పరిస్థితినైన ఎదురీది ఉన్నతస్థాయి చికిత్స కల్పించేందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీధర్ సాహు తెలిపారు. చికిత్సకు అవసరమైన ఆక్సిజన్ కొరత లేదని ఆయన భరోసా ఇచ్చారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- గాయాలతో చికిత్స పొందుతున్న మరో ఏడుగురు


ట్రక్కు ఢీకొనడంతో మృతిచెందిన యువకుడు


ట్రక్కు క్యాబిన్‌లో ఇరుక్కొని మృతిచెందిన డ్రైవర్

బరంపురం: జిల్లా పోలీసు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గత 2 రోజులు జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా, మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు ఎంకేసీజీ కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ అందించిన సమాచారం ప్రకారం.. ఆదివారం ఉదయం నగర శివారు 16వ నంబర్ జాతీయ రహదారి హల్దియాపథర్ వంతెన వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ట్రక్కులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే రోజు సాయంత్రం అలాగే నర్సింహాపూర్ రహదారిలో బస్సు ఢీకొనడంతో ఆటోలో ఉన్న ఆరుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు ఎంకేసీజీలో చేర్పించారు. శక్తి సినీమాహాల్ వద్ద స్కూల్ బస్సు, స్కూటీని ఢీకొన్న ఘటనలో గాయాలతో మహిళ ఆస్పత్రిలో చేరారు. సోమవారం ఉదయం సదర్ పోలీసు స్టేషన్ పరిధి ఫస్ట్‌గేట్ జంక్షన్‌లో ట్రక్కు-బైక్ ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. వీటిపై పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారని ఎస్పీ వివరించారు.

భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి

సర్వం సిద్ధం

- 3న భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు ఏర్పాట్లు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- నిర్వాసితులకు పరిహారం, పునరావాసం పూర్తిగా అందజేత
- అన్ని మౌలిక వసతులతో రెండు కాలనీల నిర్మాణం
- విమానాశ్రయం నిర్మాణానికి భూసేకరణ దాదాపుగా పూర్తి





ఈ చిత్రం చూశారా? 2019 ఫిబ్రవరి 14వ తేదీన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించిన శిలాఫలకం! భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి ఉద్దేశించినదే! జాతీయ రహదారికి సమీపంలోనో, విమానాశ్రయానికి ఉద్దేశించిన కీలకమైన ప్రదేశంలో గాకుండా ఎక్కడో సముద్రానికి సమీపంలో, ఓ ప్రైవేట్ లేఅవుట్ ప్రహరీకి ఆనుకొని వేసిన శిలాఫలకం ఇది. ఎందుకలా? అంటే... భూసేకరణ పూర్తికాలేదు. రైతులు కోర్టుల మెట్టు ఎక్కారు. నిర్వాసితులకు అతీగతీ లేదు. మరోవైపు జిల్లాకు చెందిన అశోక్ గజపతిరాజు అప్పటికి కొద్దిరోజుల క్రితం వరకూ విమానయాన శాఖ మంత్రిగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం నుంచీ అనుమతులేవీ కొలిక్కిరాలేదు. దేనికేదీ కొలిక్కిరాకపోయినా 2019 సార్వత్రిక ఎన్నికలకు రెండు నెలల ముందు ఆదరాబాదరాగా చంద్రబాబు వచ్చేసి టెంకాయ ఎందుకు కొట్టారో? సామాన్యులకూ ఠక్కున తెలిసిపోతుంది.. ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమని!



ఇప్పటి అసలు చిత్రం ఇది. అంతర్జాతీయ స్థాయిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సేకరించిన భూమి. కోర్టులో ఉన్న న్యాయవివాదాలను సామరస్యంగా పరిష్కరించారు. కొంతమందితో సుదీర్ఘ న్యాయపోరాటం చేసి చివరకు సానుకూల తీర్పు సాధించారు. సంబంధిత రైతులు, నిర్వాసితుల త్యాగానికి తగిన పరిహారం చెల్లించడమే గాక టౌన్‌షిప్‌లను తలదన్నేలా అన్ని మౌలిక సౌకర్యాలతో నిర్మించిన రెండు కాలనీల్లో పునరావాసం కల్పించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి అనుమతులన్నీ సాధించారు. అన్ని అడ్డంకులు, ఆటంకాలనూ పరిష్కరించిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్న మాటను నిలబెట్టుకున్నారు నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇవన్నీ చూస్తే ఆయన ఉద్దేశమేమిటో ఎవరికైనా అర్థమవుతుంది... ఎన్నాళ్లగానో అభివృద్ధిలో వెనుకబాటులోనున్న విజయనగరం జిల్లానే గాకుండా యావత్ ఉత్తరాంధ్ర దశాదిశా మార్చాలని!

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉమ్మడి విజయనగరం జిల్లానే గాకుండా ఉత్తరాంధ్ర ప్రగతికి ఊతం ఇచ్చే అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం త్వరలోనే సాకారం కానుంది. మే 3వ తేదీన శంకుస్థాపన రాయి పడనుంది. ఈ బృహత్తర క్రతువుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి హాజరవుతారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మౌలిక వసతుల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్వయంగా వెల్లడించారు. ఈ శుభ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్పడానికి భారీ బహిరంగసభ నిర్వహణకూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు సాగుతున్నాయి.

నాడు ఓట్ల కోసం టీడీపీ మమ...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు బీజం పడింది. తొలుత 15 వేల ఎకరాలు సేకరిస్తారని టీడీపీ నాయకులు ప్రకటనలు చేయడంతో భోగాపురం మండల రైతులు తీవ్ర ఆందోళనలకు దిగారు. దీంతో ఐదు వేల ఎకరాలతో సరిపెట్టాలని నాటి టీడీపీ ప్రభుత్వం దిగొచ్చింది. తీరా రైతులకు పరిహారం ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున ప్రకటించింది. మళ్లీ దీనిని వ్యతిరేకిస్తూ 2015 ఆగస్టులో రైతులు రోడ్డెక్కారు. నిబంధనలేవీ పాటించకుండా నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ కొంతమంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. అవి పెండింగ్‌లో ఉండగానే 2019 సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి కోసం చంద్రబాబు శంకుస్థాపన ఘట్టం మమ అనిపించేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తానే నిర్మించానని చెప్పుకోవాలనే ప్రచారయావతోనే హడావుడిగా శంకుస్థాపన చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి.

భూసేకరణ దాదాపుగా కొలిక్కి...


విమానాశ్రయ నిర్వహణకు, ఇతర అనుబంధ కార్యకలాపాలకు 2,750.78 ఎకరాలు సరిపోతాయని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో 422.69 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక 1,413 మంది రైతులకు చెందిన 1,383.39 ఎకరాల జిరాయితీ భూమి, 572 మంది లబ్ధిదారుల స్వాధీనంలో నున్న డీ పట్టా (అసైన్డ్) భూమి సేకరణ ప్రక్రియను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. విమానాశ్రయ పరిధిలోనే గత టీడీపీ ప్రభుత్వం అక్కడక్కడ వదిలేసిన దాదాపు 117 ఎకరాల సేకరణ కూడా ఇప్పుడు పూర్తయింది. జాతీయ రహదారి నుంచి అనుసంధాన రోడ్డు, ట్రంపెట్ ఆకారంలో వంతెన నిర్మాణానికి అవసరమైన 119 ఎకరాల సేకరణ రెండో దశ నోటిఫికేషన్‌తో కొలిక్కి వచ్చింది. మొత్తం ఈ భూమిలో దాదాపుగా 2,200 ఎకరాలను విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది.

నిర్వాసితులకు మంచి కాలనీలు

ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాల కోసం రూ.80 కోట్ల వ్యయంతో టౌన్‌షిప్‌లను తలదన్నేలా రెండు కాలనీలను ప్రభుత్వం నిర్మించింది. తొలుత 376 కుటుంబాలకు పునరావాస పరిహారంగా ఐదు సెంట్ల చొప్పున ఇంటి స్థలం, రూ.8.70 లక్షల చొప్పున పరిహారం, అదనంగా మరో రూ.50 వేల చొప్పున రవాణా ఖర్చును ప్రభుత్వం అందించింది. ఇటీవలే మరో 28 కుటుంబాలకు అదే తరహా ప్యాకేజీని ప్రకటించింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే ఘనత

ఉమ్మడి విజయనగరం జిల్లా వాసుల చిరకాల స్వప్నం సాకారమవుతుందంటే ఆ ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. విమానాశ్రయానికి అవసరమైన అనుమతులను సాధించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ స్థాయిలో విశ్వ ప్రయత్నాలు చేశారు. మరోవైపు క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నారు. భూమి పరిస్థితిని బట్టి ఎకరాకు రూ.28 లక్షల నుంచి రూ.36 లక్షల వరకూ పరిహారం ప్రకటించారు. అంతకుముందు డి.పట్టా భూములకు టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రూ.12.50 మాత్రమే. అలాగాకుండా వారికీ జిరాయితీ భూమితో సమానంగా పరిహారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసింది. మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, భోగాపురం మండల నాయకుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి తదితరులు రైతులతో చర్చించడంతో రైతులు చాలామంది హైకోర్టులో పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. మిగతావాటినీ ఇటీవల హైకోర్టు పరిష్కరించింది.


నిర్వాసితుల కాలనీ

ఉత్తరాంధ్రకే తలమానికం



దాదాపు పదివేల కోట్ల రూపాయల వ్యయంతో సాకారం కానున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకే తలమానికం. ఈ ప్రాంతవాసులకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు వస్తాయి. మే 3వ తేదీన శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. పెద్ద ఎత్తున బహిరంగ నిర్వహించాలని నిర్ణయించారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నాం. – మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్

పిన్నిగారింటికి శాంతమ్మ


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


మాబుడి శాంతమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం

బరంపురం: దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధి చెందిన మాబుడి శాంతమ్మ సంబరాలు 7 రోజుకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం 5గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి, అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం ఎదురుగా ఉన్న ధర్మజెండాకు మహిళలు పంచామృతాలు, పానకాలతో చల్లదనం చేశారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి తాత్కాలిక ఆలయ ప్రాంగణంలో సంబరాల నిర్వాహకులు పాత్రర్ల దుర్గాప్రసాద్ దేశిబెహరా సతీమణి పాత్రర్ల రేవతి అమ్మవారి ప్రధాన ఘటంతో రాజు గారి కోట, పెద్దబజార్ మీదుగా ఘటయాత్ర సాగింది. ఘటయాత్రతో స్థానిక జౌరా వీధిలో పిన్ని గారి ఇంటికి వెళ్లి, సంప్రదాయ అనుగుణంగా వివిధ రకాల పిండి వంటకాలతో పూజలు అందుకున్నారు. అనంతరం నర్సింహ మందిర్ వీధి, కేవుటి వీధి, చంద్రశేఖర్ మందిర్ వీధి, శంకర్ వీధి, జమదేహిపేట మీదుగా ఘటయాత్ర సాగింది. అయా వీధుల్లో రథాలకు భక్తులు ఆహ్వానం పలికారు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో స్థానిక దేశిబెహరా వీధిలోని తాత్కాలిక ఆయాకి చేరుకున్నారు.

నాగావళిలో పడి బీటెక్ విద్యార్థి మృతి


సునీల్ కుమార్ (ఫైల్)

బొబ్బిలి/గరుగుబిల్లి: బొబ్బిలి మండలంలోని రాముడు వలసకు చెందిన లచ్చిరెడ్డి సునీల్‌కుమార్ (24)గరుగుబిల్లి మండలం సంతోషపురం పంచాయితీ పిట్టల మెట్ట వద్ద నాగావళి నదిలో ప్రమాద వశాత్తు జారి పడి మృతి చెందాడు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బెంగళూరులో చదువుతున్న సునీల్ రెండు రోజుల క్రితమే స్వగ్రామం వచ్చి పండగ నిమిత్తం స్నేహితులు, బంధువులతో పిట్టల మెట్ట గ్రామానికి వెళ్లాడు. అందరూ కలిసి సరదాగా నాగావళి నదికి వెళ్లగా ప్రమాదం జరిగింది. సునీల్ తండ్రి తిరుపతి రావు రాజాకాలేజీలో తాత్కాలిక పద్ధతిన లెక్చరర్‌గా పనిచేస్తుండగా తల్లి శకుంతల గృహిణి. ఈ దంపతుల పెద్ద కుమారుడు లోకేష్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.

క్లుప్తంగా

దివ్యాంగులకు అండగా..



దివ్యాంగులను వాహనంలో తీసుకెళ్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: దివ్యాంగులను తమ వాహనంలో గమ్యస్థానానికి చేర్చి పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలో దివ్యాంగులు సోమవారం ధర్నా చేశారు. కార్యక్రమం పూర్తయిన తరువాత తమ గ్రామాలకు వెళ్లేందుకు మండుటెండలో నడుచుకుంటూ వెళ్తూ ఇబ్బంది పడుతున్నారు. వారిని గమనించిన టెక్కలి ఎస్‌ఐ-2 రమేష్‌బాబు పోలీస్ వాహనంలో ఎక్కించుకుని గమ్యానికి చేర్చారు. వారంతా ఎస్‌ఐకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా ఏపీ జేఏసీ అమరావతి, అనుబంధ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు స్పందనలో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ అమరావతి శ్రీకాకుళం జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు, అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, జనరల్ సెక్రటరీ ఎన్.వి.రమణ, వైస్ చైర్మన్ జె.రామారావు, ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాలరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ బి.వి.వి.ఎన్.రాజు, లింగరాజు, రాజారెడ్డి, సచివాలయం ఉద్యోగుల రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎస్.గోవిందరావు ఉన్నారు.

అప్రంటీస్‌ను సద్వినియోగం చేసుకోవాలి




మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులు అప్రంటీస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ కె.ఎస్. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సోమవారం అప్రంటీస్ మేళా నిర్వహించారు. మేళాలో లక్ష్యయ సోలార్, తోషిబా ట్రాన్స్‌మిషన్, యునైటెడ్ బ్రేవరేజెస్, రెడ్డి లాబ్స్, శ్యాంక్రిగ్ పిస్టన్స్ పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ట్రేడుల నుంచి 106 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 39 మందిని ఇంటర్వ్యూ ద్వారా వివిధ కంపెనీలు ఎంపిక చేసుకున్నాయి.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని రెండు కళాశాలల్లో జరుగుతున్న జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీ కేంద్రంలో మొదటి షిఫ్టులో వందకి 97 మంది, రెండో షిఫ్టులో వందకి 98 మంది హాజరయ్యారు. అలాగే చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కాలేజీ కేంద్రంలో మొదటి షిఫ్టులో 81కి 78, రెండో షిఫ్టులో 80కి 79 మంది హాజరయ్యారు. ఎన్‌టీఏ అధికారులు పర్యవేక్షించారు.

పిడుగుపడి 50 బస్తాల ధాన్యం దగ్ధం



కాలిపోయిన ధాన్యం

ఇచ్ఛాపురం: పిడుగుపాటుకు 50 బస్తాల ధాన్యం బస్తాలు బూడిదయ్యాయి. ఈ సంఘటన మున్సిపాలిటీ పరిధి కండ్రవీధిలో చోటుచేసుకోగా.. రైతు నెపిరి దేవి నష్టపోయారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళితే.. దేవి మూడు నెలల క్రితం తన పంటపొలం నుంచి తీసుకొచ్చిన ధాన్యాన్ని కండ్రవీధిలోని తన ఇంటి వద్ద పాతర వేసి భద్రపరిచారు. వారం రోజుల క్రితం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడ్డాయి. ఈ క్రమంలో నాలుగో తేదీన వర్షం కురుస్తున్నప్పుడు పాతర సమీపంలో పిడుగు పడింది. బయట ఎటువంటి ఆనవాళ్లు లేకపోవడంతో నష్టం జరగలేదని భావించారు. అయితే సోమవారం ధాన్యం తీసేందుకు పాతరను తవ్వచూడగా కాలిపోయి కనిపించడంతో రైతు కుటుంబ సభ్యులు విలపించారు.

ఆక్రమణల చెరలో సాగునీటి కాలువలు!



రైతులకు సాగునీరు అందిస్తున్న కల్వర్టులో అక్రమ నిర్మాణాలు

- కుచించుకుపోతున్న నీటి వనరులు
- సక్రమంగా నీరు పారక రైతుల ఆందోళన

మందస: సాగునీటి కాలువలకు సమీపంలో అక్రమ నిర్మాణాలు చేస్తుండడంతో సక్రమంగా నీరు పారక రైతులు ఆందోళన చెందుతున్నారు. మహేంద్రతనయ, సునాముదిలు ఒడిశాలో ఉద్భవించి.. ఆంధ్రాలో ప్రవహించి సాగునీరు అందిస్తున్నాయి. రాజుల హయాంలో చక్కని కాలువలు నిర్మించి, సాగునీరును వేల ఎకరాలకు అందించారు. ప్రస్తుతం ఈ కాలువలు విస్తీర్ణం కుచించుకుపోతున్నాయి. కొంతమంది కాలువల సమీపంలో అక్రమ నిర్మాణాలు చేపడుతుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఉండాల్సిన వెడల్పు కంటే తగ్గి.. సాగునీరు అందడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మందస మండలంలో మహేంద్రతనయ, సునాముది, సంకుజోడు తదితర సాగునీటి వనరులున్నాయి.



ఉమాగిరి వద్ద సునాముది కాలువ దుస్థితి

వీటిద్వారా మందసతో పాటు పలాస, సోంపేట మండలాల్లోని కొన్ని గ్రామాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తాయి. గతంలో కాలువలకు మరమ్మతులు మాత్రమే కావాలని కోరిన రైతులు ప్రస్తుతం ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని అధికారులను వేడుకుంటున్నారు. మందస, బాలిగాం, ఉమాగిరి, కుంటికోట తదితర ప్రాంతాల్లో కాలువల దుస్థితి చూస్తే ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొంతమంది ధనికులు కాలువలను ఆక్రమించి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. సక్రమంగా నీరు పారాల్సిన కాలువలు ప్రస్తుతం అందుకుభిన్నంగా ఉన్నాయి. కాలువలకు ఇరువైపులా కొంతమంది అక్రమ నిర్మాణాలు కొంతమంది చేపట్టగా.. మరి కొంతమంది కాలువల్లో పైపులతో కల్వర్టులు నిర్మించి, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నారు. ఈ సంఘటనలపై రైతులు తరుచూ స్పందిస్తున్నారు. పితాతొళి, ఉమాగిరి, భైరిసారంగపురం, డబారు, పుచ్చపాడు రైతులు అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న సమయంలో ఆందోళనలు చేసి, అడ్డుకుంటున్నారు. దీంతో రాత్రి వేళలు, ఉదయాన్నే నిర్మాణం పనులు చేస్తున్నారు. రైతులు గమనించేలోగా పనులు పూర్తి చేస్తున్నారు. ఇటీవల సంకుజోడు కాలువల్లో జాతీయ రహదారి నిర్మాణం పనుల్లో భారీగా మట్టిని తోసేశారు. రైతులు, యాజమాన్యం మధ్య గొడవలు జరగడంతో ఉన్నతాధికారులు దిగి వచ్చారు. ఈ తరుణంలో కాలువల్లో పైపు పనులు చేస్తున్నారు. బాలిగాం వద్ద కూడా పరిస్థితి దారుణంగా ఉంది. చెరువులు, కాలువలను ఆక్రమించుకుని, వాటిపై నిర్మాణాలను అక్రమంగా చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. జిల్లా ఉన్నతాధికారులు కూడా పరిశీలన చేసినప్పటికీ చర్యలు మాత్రం లేదని రైతులు చెబుతున్నారు. మూడు రోజుల క్రితం మందస శివార్లో జరిగిన నిర్మాణాలపై మరోసారి రైతులు ఆందోళనకు దిగారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

కాలువలపై నిర్మాణాలతో తీవ్రనష్టం



సునాముది, మహేంద్రతనయ, సంకుజోడు నీటి వనరులు ప్రకృతి ప్రసాదించిన వరాలు. ప్రస్తుతం వీటి పరిస్థితి దారుణంగా ఉంది. కాలువల ఆక్రమణ యథేచ్ఛగా కొనసాగుతోంది. అక్రమ నిర్మాణాలతో భూములకు సాగునీరు సక్రమంగా అందడంలేదు. అధికారులకు ఫిర్యాదు చేస్తుంటే స్పందించడంలేదు. రెవెన్యూపై ఇరిగేషన్, జలవనరులశాఖపై రెవెన్యూ ఆరోపణ, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారే తప్ప రైతులకు న్యాయం చేయడంలేదు. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది.

– చింతాడ గణపతి, రైతు, పితాతొళి

న్యాయం చేయాలి



సాగునీరు అందించే కాలువలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో సక్రమంగా సాగునీరు అందక పంటలు నష్టపోతున్నాం. అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితంలేదు. జలవనరులశాఖ ఏఈ తప్పించుకోవడానికే ప్రయత్నిస్తున్నారు. ఆక్రమణదారులకు కొమ్ముకాస్తున్నారు.

– మురపాల నారాయణరావు, ఎంపీసీటీ మాజీ సభ్యుడు, భైరిసారంగపురం

ఆక్రమణలు వాస్తవమే..



మహేంద్రతనయ, సునాముది, సంకుజోడ సాగునీటి వనరులపై ఆక్రమణలు వాస్తవమే. కొంతమందికి నోటీసులు ఇచ్చాం. రైతుల నుంచి సరైన ఫిర్యాదు అందడం లేదు. రెవెన్యూశాఖ సహకరించడంలేదు. రెవెన్యూ సహకరిస్తే ఆక్రమణలు తొలగించగలం. కాలువల విస్తీర్ణం తగ్గిపోతోంది. రైతులకు న్యాయం చేయాలని ప్రయత్నిస్తున్నాం. కొన్ని ఒత్తిళ్లు ఉన్నాయి. దీంతో చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నాం. వీటిపై ఫైల్ కూడా తయారు చేస్తున్నాం.

– ఎస్.వి.శ్రీనివాసరావు, ఏఈ, జలవనరులశాఖ

తుది జట్టు కోసం సన్నాహక మ్యాచ్‌లు

- 43 మంది సభ్యులతో ప్రాబబుల్స్ జాబితా వెల్లడి



సెలక్షన్ మ్యాచ్‌లో క్రీడాకారుల రాణింపును పరిశీలిస్తున్న సెలక్టర్లు

శ్రీకాకుళ న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ క్రికెట్ జట్టు తుది ఎంపికలకు కసరత్తులు మొదలయ్యాయి. 2023-24 సీజన్ టీ-20, వన్డే క్రికెట్ టోర్నీలో పాల్గొనే జిల్లా సీనియర్స్ పురుషుల క్రికెట్ జట్టు ప్రాబబుల్స్ జాబితా ఖరారైంది. 43 మంది సభ్యులతో కూడిన జిల్లా క్రికెట్ ప్రాబబుల్స్ జాబితాను జిల్లా క్రికెట్ సంఘం శ్రీకాకుళం ప్రధాన కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ వెల్లడించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఈనెల తొమ్మిదో తేదీన జిల్లా సీనియర్స్ జట్టు ఎంపికలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సెలక్షన్ కమిటీ సభ్యులు ప్రాబబుల్స్ జట్టుకు ఎంపిక చేసినట్టు ముస్తాక్ తెలిపారు.

నేటి నుంచి సెలక్షన్ మ్యాచ్‌లు..

ఇదిలా ఉండగా త్వరలో జరిగే ఏసీఏ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో పాల్గొనే తుది జట్టు ఎంపిక కోసం జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు కళింగపట్నం క్రికెట్ మైదానం వేదికగా మూడు రోజులపాటు సెలక్షన్ మ్యాచ్‌లను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మ్యాచ్‌ల్లో క్రీడాకారుల రాణింపు ఆధారంగా తుది జట్టును ప్రకటించనున్నారు. కాగా జిల్లా సీనియర్స్ ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులంతా ఈనెల 11వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు కళింగపట్నం క్రికెట్ మైదానం వద్ద రిపోర్ట్ చేయాలని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ సూచించారు. మరిన్ని వివరాలకు బి.శ్రీవర్ధన్, డీసీఏ (సెల్: 8978884646), అన్నెపు ఆనంద్‌కుమార్, ఏసీఏ కోచ్ (సెల్: 9177306940) లను సంప్రదించాలన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం





ఎస్పీ రాధిక నుంచి నగదు, ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఆదినారాయణ, పూర్ణారావు

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో హోంగార్డులు ఎంతో నిబద్ధతతో చేసే సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డులు ఐ.ఆదినారాయణ, బి.పూర్ణారావులను పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో పాటు నగదు సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం పాటు కేటాయించిన విధులు చక్కగా నిర్వర్తించడం వీరికే చెల్లిందన్నారు. ఇకపై ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, కుటుంబ సభ్యులతో ఆనంద జీవితం గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఐ బి.ప్రదీప్, హోంగార్డుల కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో 'జగనన్న విద్యాకానుక'

- రాష్ట్ర పరిశీలకులు విజయభాస్కర్



మాట్లాడుతున్న విజయభాస్కర్

ఆమదాలవలస రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేయనున్నట్టు రాష్ట్ర పరిశీలకులు విజయభాస్కర్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నాలుగో విడత విద్యాకానుక కిట్లు పంపిణీ, నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి పాఠశాలల్లో చదవే విద్యార్థులందరికీ కిట్లు పంపిణీ చేస్తామన్నారు. పాఠశాలల ప్రారంభానికి ముందే కిట్లు మండల కేంద్రాలకు సరఫరా చేస్తామని.. అక్కడ నుంచి పాఠశాలలకు చేర్చాలని సూచించారు. కిట్లను తగిన గదుల్లో భద్రపరిచాలన్నారు. విద్యా కానుక పంపిణీల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన పర్యవేక్షణ జరిపి అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో పగడాలమ్మ, మండల విద్యా సంక్షేమాధికారి కూర్మారావు, మానిటరింగ్ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

అర్ధరాత్రి అలజడి!

- పార్కు చేసిన కారుల అద్దాలు ధ్వంసం



కారును ధ్వంసం చేసినట్టు ఫిర్యాదు చేసిన సీహెచ్ ఆనంద్ కిశోర్



హెచ్‌బీ కాలనీలో ధ్వంసమైన కారు అద్దాలు

శ్రీకాకుళం క్రైమ్: గుర్తు తెలియని ఆగంతకులు ఆదివారం అర్ధరాత్రి దాటాక నగరంలోని పలు కాలనీల్లో అలజడి సృష్టించారు. ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన కారుల అద్దాలను పగులగొట్టారు. హెచ్‌బీ కాలనీ, పట్నాయక్ కాలనీ, కార్గిల్‌పార్క్, ఎల్‌బీఎస్ నగర్, పద్మావతి నగర్ స్థానికులు, కార్ల యజమానులు సీహెచ్ ఆనంద్ కిశోర్, కాళిరాజు, ఉమావెంకటేశ్వరరావు, పంతులు సమాచారం ప్రకారం.. అర్ధరాత్రి 1.30 నుంచి రెండు గంటల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తమ కార్ల ముందు భాగంలోని అద్దాలను పగులగొట్టి డ్యాష్‌బోర్డులను చిందరవందర చేశారని తెలిపారు. సుమారు 13 కార్ల అద్దాలను ధ్వంసం చేసినట్టు సోమవారం పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఒకటో పట్టణ సీఐ లెంక సన్యాసినాయుడు వద్ద ప్రస్తావించగా అర్ధరాత్రి తమకు ఫోన్ రాగానే ఎస్సైలు బలివాడ గణేష్, మొజ్జాడ ప్రవల్లికలతో కూడిన 20 మంది సిబ్బంది నాలుగు బీట్ టీమ్‌లుగా ఏర్పడి ఘటనా స్థలాలకు వెళ్లి కార్లను పరిశీలించినట్టు చెప్పారు. కారు అద్దాలు పగులగొట్టడం వాస్తవమేనని, అందులో నగదు ఏమీ పోలేదని చెప్పారు. వెంటనే తమ టీమ్‌లు సంబంధిత ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. అలాగే సీసీ ఫుటేజీలు పరిశీలించి నిందితుల కోసం గాలించామని చెప్పారు. తమకు రెండు ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. కాగా మద్యం మత్తులో నిత్యం సైకోలా ప్రవర్తించే ఫాజుల్‌బేగ్‌పేట్‌కు చెందిన యువకుడు మరో వ్యక్తితో కలిసి ఈ పని చేసినట్లు పోలీసులు గుర్తించినట్టు తెలిసింది.

వైభవంగా వెంకన్న చక్రతీర్థస్నానాలు



ఉత్సవమూర్తులకు అవబృదస్నానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయ వార్షిక తిరుక్కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం చక్రతీర్థస్నానం నిర్వహించారు. ముందుగా హోమం, పూర్ణాహుతి జరిగింది. శ్రీకూర్మం దేవస్థానం అర్చకుడు గోపినంబాళ్ల నల్ల కూర్మాన్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు బూరాడ వంశీకృష్ణ అర్చకత్వంలో స్వామివారి ఉత్సమూర్తులను నాగావళి నదికి తీసుకెళ్లి అవభృత స్నానాలు, వసంతోత్సవం చేశారు. ధ్వజావరోహణం, వేదస్వస్తి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు, మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



పులక జగ్గారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఎస్.చిరంజీవి, మిగతా పోలీస్ సిబ్బంది

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామం వద్ద ట్రాక్టర్ ఢీకొని పులక జగ్గారావు(38) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పులకపుట్టుగ గ్రామానికి చెందిన జగ్గారావు కొన్ని పనుల కోసం బైక్‌పై కంచిలి వచ్చి తిరిగి స్వగ్రామం బయల్దేరాడు. దారిలో చిన్నశ్రీరాంపురం గ్రామానికి చెందిన గజ్జి మహాలక్ష్మిని ఎక్కించుకుని వెళ్తుండగా ఎర్రచెరువు వద్ద శ్రీరాంపురం నుంచి కత్తివరం రోడ్డు మార్గంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరి బండిని ఢీకొట్టింది. దీంతో మోటారు సైకిల్ మీద ఉన్న పులక జగ్గారావు, వెనుక ఉన్న గజ్జి మహాలక్ష్మిలు రోడ్డు మీద పడ్డారు. ఇందులో మహాలక్ష్మికి తలపై తీవ్రగాయమవ్వగా, జగ్గారావు అక్కడికక్కడే మృతిచెందాడు. మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మఠం కంచిలికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ యండమూరి వాసుదేవరావుపై కంచిలి ఎస్ఐ ఎస్. చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తాపడి నలుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన సిమ్మయ్య

టెక్కలి రూరల్: లచ్చన్నపేట గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఆటో బోల్తాపడి నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగాం మండలం సుభద్రపురం గ్రామానికి చెందిన కె.కాంతమ్మ, డి.సిమ్మయ్య, డి.లక్ష్మిలు పాతపట్నం అమ్మవారి గుడికి టెక్కలి మీదుగా వెళ్లేందుకు పాలవలస గ్రామానికి చెందిన కె.సూర్యనారాయణ ఆటోలో బయలు దేరారు. ఆటో టెక్కలి సమీపంలోని లచ్చన్నపేట వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి సమీప పొలంలో బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురికీ తీవ్రగాయాలు కావడంతో వారిని హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడిందని డ్రైవర్ చెబుతున్నారు. టెక్కలి ఎస్ఐ రామకృష్ణ వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య



గొండు రాజేష్ (ఫైల్)

గార: గొంటి పంచాయతీ దీపావళి గ్రామానికి చెందిన గొండు రాజేష్ (20) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి ఐతమ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న రాజేష్ పరీక్షలకు సమాయత్తంలో ఒత్తిడికి గురయ్యాడు. ఈ పరిస్థితుల్లో ఆదివారం ఇంటివద్ద ఉన్న పురుగుమందు తీసుకోవడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గార పోలీసులు తెలిపారు.

'రాజీ మార్గమే ఉత్తమం'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే సమాజంలో శాంతిభద్రలు భద్రంగా ఉండడంతో పాటు కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. కోర్టు హాల్‌లో సోమవారం జిల్లాలోని పోలీస్, ఎక్సైజ్, ఎలక్ట్రిసిటీ, లేబర్ డిపార్టుమెంటు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మే 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. దీనిపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు.

హడలెత్తించిన కింగ్ కోబ్రా



కంచిలి: మండలంలోని కుంబరినౌగాం గ్రామంలో 12 అడుగుల కింగ్ కోబ్రా పాము హల్‌చల్ చేసింది. ఈ పాము సమీప కొండల్లో నుంచి కుంబరినౌగాం గ్రామంలోకి ఆదివారం రాత్రి ప్రవేశించింది. స్థానికులు దీన్ని చూసి ఆందోళన చెందారు. సోంపేటలో ఉండే స్నేక్ క్యాచర్ బాలరాజుకు సమాచారం ఇవ్వడంతో ఆయన సోమవారం ఉదయం వెళ్లి పామును అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి అటవీ శాఖ అధికారులు ఈ సర్పాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీన్ని మళ్లీ అటవీ ప్రాంతంలో విడిచిపెడతారని బాలరాజు తెలిపారు.

సెబ్ సీఐకు బెస్ట్ ఇంటెలిజెన్స్ అవార్డు



చిగురుపల్లి రాజులు నాయుడు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న చిగురుపల్లి రాజులు నాయుడుకు అరుదైన గౌరవం లభించింది.ఏపీ స్టేట్ బెస్ట్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ రన్నరప్‌గా నిలిచి అవార్డు గెలుపొందారు. ఈ మేరకు సోమవారం మంగళగిరి తాడేపల్లిలో ఉన్న సెబ్ హెడ్‌క్వార్టర్స్ కార్యాలయంలో అడిషనల్ డీజీ, సెబ్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ చేతుల మీదుగా నగదు బహుమతి, సర్టిఫికెట్‌తో పాటు ట్రోఫీ అందుకున్నారు. సెబ్‌లో రాకముందు లాఅండ్ ఆర్డర్ సీఐగా చీపురుపల్లిలో 2019-20 కాలంలో, వైజాగ్ సిటీ క్రైమ్‌లో 2020-22 కాలంలో పనిచేశారు. 2022 ఆగస్టులో శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో సీఐగా విధుల్లో చేరారు. అప్పటి నుంచి 20 కేసులను దర్యాప్తు చేసి ఫలితాలు రాబట్టినందుకు 179 ఇంటెలిజెన్స్ లీడ్స్ కలెక్ట్ చేసినందుకు ఈ అవార్డు దక్కిందన్నారు. ఈయన యోగా శిక్షకులు కావడం కూడా విశేషం.

ఎలుక ఆకలి మూల్యం రూ.6లక్షలు!



కాలిపోయిన సామాన్లు

ఇచ్ఛాపురం రూరల్: భూమి పత్రాలు, డబ్బులు, సర్టిఫికెట్లు, ఇంటిలోని సామాన్లు.. ఒక చిన్న ఎలుక ఆకలికి ఆహుతైన వస్తువుల జాబితా ఇది. చిట్టెలుక చేసిన పనికి ఒక ఇల్లు నిట్ట నిలువునా మునిగిపోయింది. నైవేద్యం తినడానికి వచ్చిన ఎలుక ఆ ఇంటిని అగ్ని దేవుడికి సమర్పించేసిన ఘటన తేలుకుంచి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తేలుకుంచి గ్రామానికి చెందిన మేరుగు పురుషోత్తం భార్య ఢిల్లేశ్వరి సోమవారం ఉదయం ఇంట్లో దేవుని ముందు దీప,ధూప, నైవేద్యాలను పెట్టిన తర్వాత తలుపులు వేసుకుని ఉపాధి పనులకు వెళ్లిపోయారు. ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ఎలుక నైవేద్యాన్ని తీనేందుకు వచ్చి దీపాన్ని నేలపాలు చేసింది. దీంతో ఇల్లంతా మంటలు అంటుకున్నాయి. ఇంట్లో ఉన్న సామగ్రి, రూ.30 వేల నగదుతో పాటు స్వయం సహాయక సంఘాల అప్పులు, పొదుపు నగదు సైతం కాలిపోయాయి. వీటితో పాటు వ్యవసాయ పత్రాలు, సర్టిఫికెట్లు, గృహోపకరణాలు కాలిబూడిదయ్యాయి. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చినప్పటికీ అప్పటికే నష్టం జరిగిపోయింది. బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు. దాదాపు రూ.6లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.